# ఐదొందలనోటు

## - సూరంపూడి శరత్‌బాబు

సాయంత్రం ఆరవటంతో కనకం గుమ్మం దగ్గరే నిలబడి లక్ష్మీపతి కోసం ఎదురు చూస్తోంది.

'రోజూ ఆఫీసు నుంచీ ఆలస్యంగా వచ్చినా ఫర్వాలేదు గానీ కనీసం జీతాల రోజైనా ఐదింటికి ఆఫీసవగానే ఇంటికొచ్చెయ్యాలన్న ధ్యాస వుండదీ మనిషికి. ఎక్కడ లేని ఫ్రెండ్స్ ఇవాళే తగులుకుని వుంటారు. పోసుకోలు వాగుడు వాగుతూ గంటల తరబడి కాలక్షేపం చేస్తున్నారో లేక ఏ ట్యాంక్ బండ్‌పైన వేరుశనగకాయలు తింటూ దిక్కులు చూస్తూ పచార్లు కొడుతున్నారో' అనుకుంది కనకం.

సమయం రాత్రి తొమ్మిది కావస్తోంది. రొప్పుతూరోస్తూ అసహనంగా ఇంట్లోకొచ్చాడు లక్ష్మీపతి. మొగుడ్ని చూడగానే

''ఇప్పటికి గుర్తొచ్చిందన్నమాట మీకిల్లు'' అంటూ గయ్యిమని లేచింది కనకం.

''అది కాదే..అసలేమైందంటే..'' అంటూ సర్దిచెప్పబోయాడు లక్ష్మీపతి.

''చాల్లే ఆపండి మీ కుంటిసాకులు. మన పెళ్లయినప్పటి నుండీ వింటూనే వున్నాను. రోజూ ఏదో వెధవ పనిచెయ్యటం, దాన్ని సమర్థించుకోవటానికి మళ్ళీ ఏవో అబద్ధాలు చెప్పటం మీకు మామూలైపోయింది.''

''ఇవాళ మా ఆఫీసులో జీతాలు చాలా ఆలస్యంగా ఇచ్చారే'' అన్నాడు లక్ష్మీపతి.

''ఇవిగో మల్లెపూలు, ఇదిగో జీతం కవరు'' చేతికందించాడు లక్ష్మీపతి.

జీతం కవరు చేతిలో పడగానే టీవీడబ్బైనా ఎక్కడ లేని ఆనందం ఉప్పొంగింది కనకం ముఖంలో. ఎందుకంటే ఈనెల జీతంలో కనీసం వెయ్యి రూపాయలైనా మిగుల్చుకుని మార్కెట్లోకొచ్చిన కొత్తమోడల్ చీరలు కొనుక్కోవాలని మనసులో చిరుకోరిక.

''అది సరేగానీ జీతం కవరు మరీ ఇంత తేలిగ్గా ఉందేమిటండీ'' అంటూ కవరు విప్పింది కనకం.

''మరదే విచిత్రం! ఈసారి ఎంచక్కా అన్నీ ఐదొందల నోట్లే ఇచ్చారే మా ఆఫీసు వాళ్ళు '' అన్నాడు ఆనందంగా లక్ష్మీపతి.

''హేయ్...ఎన్ని ఐదొందలనోట్లో..ముద్దుగా బలే వున్నాయండీ'' సంబరపడిపోతూ బీరువాలో దాచింది కనకం.

★★★

''అబ్బబ్బబ్బ ఎవరో గుయ్..గుయ్ మంటూ కాలింగ్ బెల్ నొక్కేస్తున్నారు. కాస్త లేచి చూడవే కనకం'' భార్యని తట్టి లేపాడు లక్ష్మీపతి.

''అప్పుడే తెల్లారిందా'' అంటూ ఆవులించుకుంటూ తలుపు తీసింది కనకం. ఎదురుగా పాలవాడు కనబడ్డంతో

''ఏంటయ్యా నెమ్మదిగా వస్తున్నాగా ఇంతలోనే తొందరా!'' అంటూ విసుక్కుంది కనకం.

''అదికాదమ్మగారూ! మీరొక్కరే పావుగంట చేస్తే మిగిలిన వాళ్ళందరికీ పాలు పోసుకెళ్ళేసరికి రాత్రయిపోతుంది మరి'' అన్నాడు పాలవాడు.

గిన్నెలో పాలు పోయించుకుంటూ ''పాలల్లో నీళ్ళ తగ్గించవయ్యా తాగలేక చస్తున్నాం'' అంది కనకం.

''భలేవారే మనదసలే హైదరాబాదు మహానగరం. అందులోనూ వేసం కాలం. ఇక నీళ్లెక్కడ దొరుకుతాయమ్మా! మీరు మరీ జోకులేస్తున్నారు. అది సరేగానీ అయ్యగార్ని పిలవండమ్మా పాల బిల్లు ఇవ్వాలి'' అన్నాడు.

''ఏవండోయ్ మిమ్మల్నే..పాలవాడు డబ్బులడుగుతున్నాడు'' అంటూ పిలిచింది కనకం.

''ప్చ్..ఒక్క అరగంట కూడా ఎక్కువ సేపు పడుకోవటం కుదర్దుకదా! రాత్రంతా దోమలగోల, పగలంతా జనాల గోల. ఛస్తున్నాంరా బాబూ!'' అనుకుంటూ లేచాడు లక్ష్మీపతి.

ఐదొందల నోటుని ప్రేమగా ఓసారి చూసుకుని ''ఇదిగో నయ్యా ఐదొందల నోటు'' అంటూ గొప్పగా పాలవాడి చేతికిచ్చాడు లక్ష్మీపతి.

పాలవాడు ప్రపంచంలో ఎక్కడాలేని వింతను చూస్తున్నట్లు ఆశ్చర్యపోయాడు.

''అదుగో నువ్వలా ఆశ్చర్యపోతావని నాకు తెలుసోయ్. నువ్వేకాదు ఎవరైనా ఇలా ఆశ్చర్యపోవలసిందే. ఎందుకంటే ఇన్నాళ్ళూ వందరూపాయల నోట్లని చూసీ చూసీ విసుగెత్తిన మనకు ఒక్కసారిగా ఐదొందల నోటు కనిపిస్తే ఆశ్చర్యం కాక మరేమిటి. అంతెందుకూ ఇంకొన్నాళ్లాగితే ఎంచక్కా వెయ్యి రూపాయల నోట్లు కూడా వస్తాయట తెల్సా''

''ఆపండి మీ నోట్ల రామాయణం'' అంటూ కస్సుమని లేచాడు పాలవాడు.

''అదేమిటయ్యా! ఇప్పుడేమైంది'' అన్నాడు లక్ష్మీపతి.

''ఏడ్చినట్లుంది, ఇది దొంగనోటు'' అన్నాడు పాలవాడు.

''ఇది దొంగనోటా? ఆ విషయం నీకెలా తెలుసు! నేనేమైనా దీన్ని ప్రింట్ చేశానా ఏమిటి! పొద్దున్నే నీకేమైందయ్యా! మతుండే మాట్లాడుతున్నావా'' అన్నాడు లక్ష్మీపతి.

''ఆ..మతుండబట్టే దీన్ని తీస్కోనంటున్నా! మీరు పాలడబ్బులు ఈనెల్లో ఇవ్వకపోయినా ఫర్వాలేదు. బాకీ ఉంచి వచ్చే నెల్లో ఇచ్చినా తీస్కుంటాను గానీ ఐదొందల నోటు మాత్రం చచ్చినా తీస్కోను. అవతల చాలామందికి పాలు పొయ్యాలి వస్తా'' వెళ్ళిపోయాడు పాలవాడు.

కాఫీ తాగుతూ కుర్చీలో కూర్చుని రిలాక్స్ అవుతున్నాడు లక్ష్మీపతి. ఇంతలో ''సార్ పేపరు'' అంటూ న్యూస్‌పేపర్‌ని ఎంతో వినయంగా చేతికందించాడు పేపర్‌బోయ్. రోజూ గేటు బయటినుండే రాకెట్‌లా చుట్టచుట్టి ఎక్కడ పడుతుందో కూడా చూస్కోకుండా రివ్వుమని పేపర్‌ని విసిరేసే వాడు ఇవాళ అతివినయంగా ఇంట్లోకొచ్చి పేపర్‌ని చేతికందించాడంటే దానర్థం ఊహించాడు లక్ష్మీపతి.

అతనిచ్చిన బిల్లు తీసుకుని డబ్బులు ఇచ్చాడు లక్ష్మీపతి.

''అయ్యబాబోయ్..ఏమిటండీ ఐదొందల నోటిచ్చారు. ఇది చెల్లదుగానీ బిల్లుకు సరిపడా డబ్బులివ్వండి'' అన్నాడు పేపర్ బోయ్.

''ఏమిటయ్యో నిక్షేపంలాంటి ఐదొందల నోటిస్తే చెల్లదంటావేం'' అన్నాడు లక్ష్మీపతి.

''చెల్లుతుందో చెల్లదో తెలియని నోటు పుచ్చుకుని ఊరంతా తిరగటం నా వల్లకాదుగానీ బిల్లు డబ్బులు రేపిద్దురుగాని'' అంటూ సైకిల్ ఎక్కేశాడు పేపర్‌బోయ్. లక్ష్మీపతి అయోమయంలో పడ్డాడు.

''అమ్మగారూ గిన్నెలెయ్యండమ్మా'' సౌమ్యంగా అంటూ అడుగుపెట్టింది పనిమనిషి పంకజం.

''ఇవ్వాళ రెండు గిన్నెలు ఎక్కువవచ్చాయి. విసుక్కోకుండా తోము'' గిన్నెలేసింది కనకం.

''రెండు గిన్నెలు ఏంటమ్మా పదిగిన్నెలు ఎక్కువ వేసినా తోముతాను. వాకిలి రోజుకి మూడుసార్లు ఊడవమన్నా ఊడుస్తాను. బట్టలు రోజుకి ఆరుసార్లు ఉతకమన్నా ఉతుకుతాను. ఎందుకంటే ఇదంతా మా వృత్తి గదా! వృత్తిధర్మం పాటించటం నా కనీసధర్మం.'' అంటూ ఎక్కడలేని హుషారు తెచ్చుకుంది పంకజం.

రోజూ గిన్నెలు డబడబా మోగిస్తూ సొట్టలు పడేస్తూ, నడుం వంచకుండా కొయ్యలా నిలబడి, అరనిమిషంలో వాకిలి అంతా ఊడ్చేస్తూ, బట్టలు బండకేసి దబదబా బాదేస్తూ పీలికలు చేసేస్తూ ఉతికి పారేసే పంకజం ఇవాళ ఇంత నిదానంగా వ్యవహరిస్తోందంటే ఇవాళ జీతం ఇచ్చే రోజు మరి.

''ఏవండీ పనమ్మాయికి జీతం ఇచ్చేద్దామా'' అంది కనకం.

అలాగేనంటూ డబ్బులు ఇచ్చాడు లక్ష్మీపతి. డబ్బులు చూస్తూనే ఒక్కసారిగా అంది పంకజం.

''అమ్మో..మీకు దణ్ణం పెడతా. చెల్లనినోటు తీస్కుంటే ఇంట్లో మా మావ ఊర్కోడు గానీ మీరే ఐదొందల నోటు మార్చి నాకు రావాల్సిన జీతం ఇవ్వండి'' అంటూ వెళ్ళిపోయింది పంకజం.

''ఇదెక్కడి గొడవండీ. ఐదొందల నోటు చూస్తే చాలు అందరూ భయపడుతున్నారేమిటి''

''అదే నాకూ అర్థమై చావటం లేదు '' అన్నాడు లక్ష్మీపతి.

''ఎవరో పిలుస్తున్నట్టున్నారు కొంచెం చూడండి. నేను పనిలో ఉన్నాను'' అంది వంటింట్లోంచి కనకం. సర్లే అంటూ

చొక్కా గుండీలు పెట్టుకుంటూ హాల్లోకొచ్చాడు లక్ష్మీపతి.

''లక్ష్మీపతీ, లక్ష్మీపతీ'' గుమ్మం దగ్గర నిలబడి గావుకేకలేస్తున్నది సాక్షాత్తూ ఇంటి ఓనరే. వెధవది అద్దె డబ్బులు ఒక్కరోజు ఆలస్యమైనా సహించడు. పొద్దున్నే దెబ్యం మొహం వేస్కుని ఎలా వచ్చేశాడో అనుకుంటూ ''రండిసార్, కూర్చోండి'' కుర్చీ చూపించాడు లక్ష్మీపతి.

''కూర్చోవటానికి రాలేదయ్యా. నేనింకా ఆరువాటాల వాళ్లదగ్గర అద్దె వసూలు చెయ్యాలి. త్వరగా డబ్బులిచ్చేస్తే నే వెళ్ళిపోతా'' నిలబడే వున్నాడు ఓనరు. లక్ష్మీపతి ఇంట్లోకి వెళ్ళి పదిహేను వందలు తెచ్చి ఓనర్‌కివ్వబోయాడు. అంతే ఓనరు ఉవ్వెత్తున లేచాడు.

''ఏంటయ్యా పదిహేను వందలివ్వడానికి మూడు ఐదువందల నోట్లిస్తున్నావు. నీకళ్ళకి నేనెలా కనబడుతున్నాను. పేపర్లో చూడ్డం లేదా, ఐదొందలవి దొంగనోట్లు వస్తున్నాయని వార్తలొస్తున్నాయి'' అన్నాడు ఓనరు.

''ఇవి దొంగనోట్లు కావండీ. నిజం నోట్లు ఒట్టు'' అన్నాడు లక్ష్మీపతి.

''అవునయ్యా ఎలాగోలా నాకంటగట్టడానికి నిజం నోట్లని చెప్తావ్, బానే వుంది. కానీ ఇవి నాదగ్గర నుండీ ఎవరూ తీస్కోకపోతే అప్పుడు నా పరిస్థితి ఏమిటి? అయినా ఈగోలంతా నాకెందుకూ? నీకు ఒక్కరోజు టైమిస్తున్నాను. రేపు సాయంత్రానికల్లా నా ఇంటద్దె పువ్వుల్లో పెట్టి ఇచ్చావా సరే, లేకపోతే ఎల్లుండి పొద్దున్నే ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోండి'' వార్నింగ్ ఇచ్చి మరీ కదిలాడు ఇంటి ఓనరు.

ఈ ఓనర్లతో ఇదే చిక్కు . చీటికీ మాటికీ ఇల్లు ఖాళీ చెయ్యమని బెదిరిస్తూ ఉంటారు.. గొణుక్కున్నాడు లక్ష్మీపతి.


★★★

''క్యారేజీ సర్దడానికి ఇంత సేపు చేస్తే ఎలా నాకవతల ఆఫీసుకి లేటైపోతోంది'' కార్యేజి అందుకుని స్కూటర్ ఎక్కాడు లక్ష్మీపతి.

మధ్యలో స్కూటర్ ఠక్కున ఆగిపోయింది. అప్పుడు గుర్తొచ్చింది అతనికి స్కూటర్‌లో పెట్రోల్ పోయించాలని.

''ఈ స్కూటర్ ఒకటి వారం అయ్యేసరికీ మూడు లీటర్ల పెట్రోల్ తాగిపారేస్తుంది'' అని విసుక్కుంటూ పెట్రోల్ బంక్ దగ్గరకెళ్లాడు. అక్కడ చేంతాడంత క్యూ ఉంది. పెట్రోల్ ట్యాంక్ మూత తీస్తూన్న లక్ష్మీపతిని ఎన్ని లీటర్లు సార్ అంటూ డబ్బులడిగాడు బంక్ కుర్రాడు. మూడు లీటర్లు సింగిల్ ఆయిల్ అని చెప్తూ ''పెట్రోల్ పొయ్యక ముందే డబ్బులడుగుతావేంటయ్యా'' అంటూ పర్సులోంచి ఐదొందల నోటుని బయటికి తీశాడు లక్ష్మీపతి.

''ఏం వేళాకోళంగా ఉందా ఐదొందల నోటిస్తున్నారు. ఇవి చెల్లవని మీకు తెలియదా? ఈ నోటు తీస్కుంటే ముందు మా ఉద్యోగాలు పోతాయ్. వెళ్ళండి వెళ్ళండి! ఒరేయ్ ఈ బండిలో పెట్రోలు పొయ్యకండ్రా'' అరిచాడు బంక్‌లో కుర్రాడు. మొహం మాడ్చుకుని స్కూటర్ ఎక్కాడు లక్ష్మీపతి.



మెరుపులాంటి ఆలోచన వచ్చింది లక్ష్మీపతికి. ఈ ఐదొందల నోట్లతో ఇబ్బందులు పడేకంటే ఇవి ఎవరైతే ఇచ్చారో వాళ్ళకే ఈ నోట్లు తిరిగిచ్చేసి ఎంచక్కా వేరే డబ్బులు తీస్కుంటే సరిపోతుందికదా అని.

డైరెక్ట్‌గా క్యాషియర్ దగ్గరకెళ్ళాడు లక్ష్మీపతి. ''సార్ మీరో చిన్న హెల్ప్ చెయ్యాలి'' అంటూ పర్సులోంచి ఐదొందల నోట్లు తీశాడు లక్ష్మీపతి.

**చాలా రోజులనుండీ దేవుడికి అర్చన చేయిద్దామంటే కుదరటం లేదు. ఇవాళ ఎలాగూ గుడికొచ్చాం కాబట్టి దేవుడికి అర్చన చేయించినట్లూ ఉంటుంది, ఐదొందలనోటు మార్చినట్లూ అవుతుంది అని గుడి కౌంటర్ దగ్గరకొచ్చి ''అర్చనకో టిక్కెట్ ఇవ్వండి'' అంటూ ఐదొందలనోటు ఇచ్చాడు లక్ష్మీపతి.**

అంతే..క్యాషియర్ గోడలు బీటలు పడేలా పగలబడి నవ్వడం మొదలెట్టాడు.

''ఎందుకలా నవ్వుతున్నారు'' అనడిగాడు లక్ష్మీపతి.

''మీ దగ్గర ఐదొందలనోట్లు నేను తీసేస్కుని వేరే డబ్బులు మీకివ్వాలన్న మాట అంతేగా'' అన్నాడు క్యాషియర్.

''అరే మీకెలా తెలుసు. మీకేమైనా ఫేస్ రీడింగ్ వచ్చా. ఇప్పుడు నేనొచ్చింది అందుకే'' అన్నాడు లక్ష్మీపతి.

''ఫేస్‌రీడింగా పాడా! ఇప్పటిదాకా అరవైమంది ఈ పనిమీదే నా దగ్గరకొచ్చి వెళ్లారు. నువ్వు అరవై ఒకటోవాడివి. అందరికీ నేనిచ్చే సమాధానం ఒక్కటే. మీకందరికీ జీతాలివ్వటమే నా పని. అంతేకానీ మీకిచ్చిన డబ్బు తిరిగి తీస్కోవటం నా పని కాదు. మీకిచ్చిన నోట్లన్నీ సరైనవే. కాకపోతే వాటిని మార్చుకోలేకపోతే అది మీ చేతకాని తనం. దానికి నేనేం చెయ్యలేను'' తప్పించుకున్నాడు క్యాషియర్. చిన్నబుచ్చుకున్నాడు లక్ష్మీపతి.


ఆఫీసు నుంచి నిరుత్సాహంగా బయల్దేరాడు. ఈ ఐదొందల నోట్ల గొడవ ఎలా పరిష్కారమవుతుందో తెలియదు గానీ మనసంతా చిరాకుతో నిండిపోయింది. గుడికైనా వెళ్తే మనశ్శాంతి దక్కుతుందని వెంకటేశ్వరస్వామి గుడికి వచ్చాడు లక్ష్మీపతి.

చాలా రోజులనుండీ దేవుడికి అర్చన చేయిద్దామంటే కుదరటం లేదు. ఇవాళ ఎలాగూ గుడికొచ్చాం కాబట్టి దేవుడికి అర్చన చేయించినట్లూ ఉంటుంది, ఐదొందలనోటు మార్చినట్టూ అవుతుంది అని గుడి కౌంటర్ దగ్గరకొచ్చి ''అర్చనకో టిక్కెట్ ఇవ్వండి'' అంటూ ఐదొందలనోటు ఇచ్చాడు లక్ష్మీపతి.

''పవిత్రమైన గుడికొచ్చి దిక్కుమాలిన ఐదొందల నోటిస్తావా! మేం తీస్కోం ఇంకెక్కడన్నా మార్చుకో'' అని తిరిగిచ్చేశాడు కౌంటర్లో అతను. అతడంత మాటన్నాక ఇక చేసేదిలేక పర్సులో చివరికి మిగిలిన చిల్లరనోట్లు తీసి టికెట్ కొన్నాడు లక్ష్మీపతి. దేవుడి దర్శనం చేస్కున్నాడన్న మాటేగానీ చిత్తం శివుడి మీద, భక్తి చెప్పులమీద అన్నట్టు మనసంతా ఐదొందల నోట్ల గురించిన బెంగతో నిండిపోయింది లక్ష్మీపతికి.

గుడి బయటికి రాగానే దేశంలోని దరిద్రమంతా అక్కడే కనిపించింది లక్ష్మీపతికి. అదే..ముష్టివాళ్లంతా లైనులో కూర్చొని ధర్మం తల్లీ అంటూ గావుకేక లేస్తున్నారు. ఇంతలో ఒక ముష్టివాడి దగ్గర చిన్న బోర్డొకటి ఆశాకిరణంలా కనిపించింది. ''కమీషన్‌పై చిల్లర ఇవ్వబడును'' అని ఉందా బోర్డ్‌లో. అది చూసేసరికి ప్రాణం లేచొచ్చినట్లనిపించింది లక్ష్మీపతికి.

''ఇదిగోనయ్యా ఐదొందల నోటు తీస్కుని నీ కమీషన్ పోను చిల్లరివ్వు'' అని




ఆనందంతో అన్నాడు లక్ష్మీపతి.

హఠాత్తుగా అక్కడి సీన్ మారిపోయింది.

''ఏంటయ్యా మేమెంత ముష్టోళ్ళమైనా మాకూ కొన్ని నియమ నిబంధనలంటూ ఉన్నాయి. ఇలా చెల్లని నోట్లు మేం తీస్కోం'' అని ఒక్క పొలికేక పెట్టాడా ముష్టివాడు. ఇంతలో అక్కడున్న ముష్టివాళ్లంతా లక్ష్మీపతిని చూసి ఎద్దేవాగా నవ్వుకోవటం మొదలెట్టారు. ఇంకక్కడ ఒక్క క్షణం ఉన్నా పరువు దక్కదని పరుగు లంకించుకున్నాడు. చివరికి అడుక్కునే వాళ్లకి కూడా ఐదొందల నోటు లోకువైపోయినందుకు నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదతనికి.

★★★

సాయంత్రం కుర్చీలో దిగాలుగా కూర్చున్నాడు లక్ష్మీపతి. పక్కింటి బ్రహ్మానందం వచ్చి

''ఏం గురూ విచారంగా కూర్చున్నావు'' అని పలకరించాడు.

''కూర్చో గురూ'' అని కుర్చీ చూపిస్తూ ఏం చెప్పమంటావు అంటూ ఐదొందల నోట్ల రామాయణం వివరించాడు లక్ష్మీపతి.

''అవునోయ్ ఇలా ఐదొందల నోట్ల గురించి చాలా మంది చాలా రకాలుగా అవస్థలు పడుతున్నారు. మార్కెట్లోకి కొన్ని దొంగ నోట్లు వచ్చేసరికీ అసలు నోట్లేవో, నకిలీ నోట్లేవో తెలుసుకోవటం సామాన్య ప్రజానీకానికి చాలా కష్టంగా ఉంటోంది. అసలు నోటు పైన గాంధీ బొమ్మ ఉండి ఓ పక్కన గీత ఉంటుంది. కానీ దొంగ నోటుపైన గాంధీ బొమ్మా ఉండదూ గీతా ఉండదు'' అన్నాడు బ్రహ్మానందం.

''అయితే అసలు నోటేదో నకిలీ నోటేదో నువ్వు ఈజీగా కనిపెట్టగల వన్నమాట'' అన్నాడు లక్ష్మీపతి సంతోషంగా.

''అవునోయ్ నేనేదైనా ఒకసారి చూస్తే ఇట్టే పట్టేయగలను తెలుసా'' గొప్పలు చెప్పాడు బ్రహ్మానందం.

''అయితే నా దగ్గర ఉన్న నోట్లు మంచివే. అవి తీస్కుని చిల్లర ఇవ్వు గురూ'' ప్రాధేయపడ్డాడు లక్ష్మీపతి.

''అమ్మో నువ్విచ్చేవి నిజం నోట్లైనా నా దగ్గర నుంచీ ఎవరూ తీస్కోలేదనుకో, మా ఆవిడ నా వీపు చీరేస్తుంది. నీనెత్తిమీదేదో ఉందంటే నువ్వే తీసెయ్యమన్నట్టు వెనకటికెవరో. అలావుంది నువ్వు చెప్పేది. నా వల్లకాదుగానీ నీ తిప్పలేవో నువ్వేపడు'' జారుకున్నాడు బ్రహ్మానందం.

''ఇదంతా గమనించిన కనకం ఐదొందల నోట్లతో తల బాదుకునేకంటే నేనొక సలహా చెప్తాను వినండి'' అంది.

''సర్లే ఇప్పటిదాకా జరిగిన బాగోతానికే తల దిమ్మెత్తిపోయింది. ఇక నువ్వేం చెప్తావ్'' అన్నాడు లక్ష్మీపతి.

''అలా అనకండి. ప్రతి సమస్యకీ పరిష్కారం ఉంటుంది. ప్రపంచంలో నలిగి చిరిగి పీలికలైపోయిన నోట్లన్నీ చెల్లే ప్రదేశం ఒక్కటే. అదే బ్యాంక్' భార్య ఇచ్చిన సలహాకి ఎంతో సంతోషించాడు లక్ష్మీపతి.

★★★


పొద్దున్నే ఎంతో ఆనందంతో బ్యాంక్ లోకి అడుగుపెట్టాడు లక్ష్మీపతి. చేతిలో ఐదొందల నోట్లని ఏగాదిగా చూసుకుంటూ ''అమ్మయ్య ఇప్పటితో వీటి పీడ విరగడవుతుంది'' అని మురిసిపోతూ కౌంటర్‌లోని క్యాషియర్‌కు ఇచ్చాడు లక్ష్మీపతి.

''జస్ట్ ఏ మినిట్...ఈ నోట్లు చెల్లవండీ'' దొంగనోట్ల గురించి వివరించసాగాడు క్యాషియర్. ఇంతలో నోటమాట రాక దబ్బున కిందపడిపోయాడు లక్ష్మీపతి.

స్పృహతప్పి పడిపోయిన లక్ష్మీపతి చేతిలో ఐదొందలనోట్లు వెక్కిరిస్తున్నట్లున్నాయ్!

★

## కొత్త లవ్!



'విరాసత్' సక్సెస్ అయినప్పుడు 'అబ్బో! పూజా బాత్రా ఎంత లక్కీ గాళ్లో కదా! అన్నారు జనాలు. కానీ ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదామెకు. ఆ సినిమా తర్వాత పూజాకి హీరోయిన్‌గా పేరు తీసుకొచ్చే సినిమా ఏదీ రాలేదింకా. ఇటు దక్షిణాదిన కూడా ఆమెకి అవకాశాలు మృగ్యమైయ్యాయి. ప్రస్తుతం వున్న ఒకటీ అరా సినిమాల వల్ల ఖాళీగానే వున్న పూజాబాత్రా అలా వుండడం ఎందుకని కాబోలు కెనూరీవీస్ అనే ఆసామీతో ప్రేమాయణం సాగిస్తోందని బాలీవుడ్‌లో తెగ గుసగుసలు వినిపిస్తున్నాయి. 'కెనూతో కలిసి తిరుగుతుంటే భలే సరదాగా వుంటుంది. మంచి కాలక్షేపం అవుతుంది' అని గొప్పగా చెబుతోంది కూడా పూజా. అక్షయ్‌తో ప్రేమాయణం బెడిసికొట్టాక మళ్లీ ఇలా ప్రేమ వార్తలతో పాపులర్ కావాలని అనుకుంటోంది కాబోలు.

-జె.ఎం.